
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



హైవేపై అల్లాదుర్గం వద్ద ఎగ్జిట్ ఏర్పాటు చేయాలి

అల్లాదుర్గం, జూలై 27 : హైవే 161పై అల్లాదుర్గం మండల కేంద్రం వద్ద ఎగ్జిట్ (డౌన్ పాయింట్) ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు కంచరి బ్రహ్మం, పల్వాట్ల జగదీశ్వర్ తదితరులు విన్నవించారు. హైదరాబాద్‌లో శనివారం కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జ్యోషి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రకాశ్‌రెడ్డిని వారు కలసి వినతిపత్రాన్ని అందజేశారు. అల్లాదుర్గంలో పలు ప్రభుత్వశాఖల డివిజన్ కార్యాలయాలు ఉన్నా హైవేపై వాహనాలు దిగేందుకు డౌన్ పాయింట్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు.



చిన్నచింతకుంట పరిధిలో సర్వే చేస్తున్న అధికారులు

కలెక్టర్ హామీతో ట్రిపుల్‌ఆర్

సర్వేకు సహకరించిన రైతులు

చిన్నచింతకుంటలో సర్వే పూర్తిచేసిన అధికారులు

నర్సాపూర్, జూలై 27: ట్రిపుల్‌ఆర్ రోడ్డు నిర్మాణం కోసం భూములు ఇవ్వడానికి ఒప్పుకోని మెదక్ జిల్లా చిన్నచింతకుంట రైతులు రైతులు కలెక్టర్ హామీతో దిగివచ్చారు. గ్రామంలో భూసేకరణ కోసం అధికారులు శనివారం సర్వే చేశారు. నర్సాపూర్ డివిజన్ పరిధిలో ట్రిపుల్‌ఆర్ రోడ్డు 17 గ్రామాల గుండా వెళ్తుండగా మొత్తం 752.48 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించారు. భూసేకరణ కోసం 13 గ్రామాల్లో సర్వే పూర్తి చేశారు. కానీ, రెడ్డిపల్లిలో 34.45 ఎకరాలు, చిన్నచింతకుంటలో 19.83 ఎకరాలు, రత్నాపూర్‌లో 100.32 ఎకరాలు , కొంతాన్‌పల్లిలో 69.54 ఎకరాలకు సంబంధించిన సర్వే మాత్రం నిలిచిపోయింది. ఆయా గ్రామాలకు చెందిన రైతులు భూములివ్వడానికి ఒప్పుకోకుండా సర్వే పనులను అడ్డుకుంటూ వస్తున్నారు. భూమికి బదులుగా మరోచోట భూమి ఇవ్వాలని, లేదంటే మార్కెట్‌లో నడుస్తున్న ధరను చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. పలుమార్లు సర్వే కోసం వెళ్లిన అధికారులను అడ్డుకుని తిప్పిపంపారు. దీంతో వారం క్రితం కలెక్టర్ రాహుల్‌రాజ్ రైతులతో సమావేశమయ్యారు. రైతులకు న్యాయం చేస్తామని, రిజిస్ట్రేషన్ ధర పెంచడం ద్వారా పరిహారం ఎక్కువ వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ హామీతో రైతుల సర్వేకు ఒప్పుకున్నారు. ఈమేరకు చిన్నచింతకుంట గ్రామంలో శనివారం సర్వే పూర్తిచేశారు. ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సర్వేకు సహకరించిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే రెడ్డిపల్లి, కొంతాన్‌పల్లిలో కూడా సర్వే పూర్తి చేస్తామని తెలియజేశారు.

ట్రావెల్స్ బస్సులో

4 కిలోల బంగారు నగలు చోరీ

సత్వార్ సమీపంలోని కోహినూర్ దాబా వద్ద ఘటన

జహీరాబాద్, జూలై 27: చాయ్ తాగడానికి దాబా హోటల్ వద్ద ఆగితే 4 కిలోల బంగారం దొంగిలించబడింది. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం సత్వార్ సమీపంలోని కోహినూర్ దాబా వద్ద శుక్రవారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగల వ్యాపారుల వద్ద గుమాస్తాగా పనిచేసే ఆశీష్ హైదరాబాద్ నుంచి 4 కిలోల బంగారు నగలను తీసుకుని ముంబయికి ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో బయలుదేరారు. సత్వార్‌లో దాబా వద్ద బస్సును నిలపగా నగల బ్యాగులో బస్సులోనే ఉంచిన ఆశీష్.. చాయ్ తాగడానికి కిందకు దిగాడు. తిరిగి బస్సులోకి వచ్చి చూస్తే నగల బ్యాగు కనిపించలేదు. దీంతో ఆందోళనకుగురై చుట్టుపక్కలవారిని ఆరాతీశాడు. సీసీటీవీ కెమెరాల్లో ఇద్దరు వ్యక్తులు బ్యాగును తీసుకుని వెళ్తున్న దృశ్యాలు రికార్డయ్యాయి. ఈ విషయం తెలుసుకుని విచారణ చేసిన పోలీసులకు ఆశీష్ పొంతనలేని సమాధానాలు ఇచ్చినట్టు తెలిసింది. అయితే, నగలు పోయిన విషయం తెలుసుకున్న ముంబయికి చెందిన పలువురు వ్యాపారులు జహీరాబాద్‌కు చేరుకుని ఆశిష్‌ను తమతోపాటు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. నగలు పోయినట్టు ఇంకా ఎవరూ ఫిర్యాదు చేయలేదని జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ నుంచి అతడు ఎంత బంగారం తెచ్చాడనే సమగ్ర సమాచారం తెలుసుకున్నాకే ఫిర్యాదు చేస్తామని వ్యాపారులు చెప్పారని డీఎస్పీ వివరించారు. తమకు వచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని సీసీ ఫుటేజీలను పరిశీలించామని ఆయన తెలియజేశారు. కాగా, 2019లో ఇదే దాబా వద్ద ట్రావెల్స్ బస్సులో రూ.1.50 కోట్లు దొంగిలించబడడం గమనార్హం.



ఇద్దరు వ్యక్తులు బ్యాగు తీసుకుని వెళ్తున్నట్టు సీసీకెమెరాల్లో నమోదైన దృశ్యాలు

సుతార్‌పల్లిలో వైద్యశాఖ అధికారుల పర్యటన

రామాయంపేట, జూలై 27 : విష జ్వరాలతో బాధపడుతున్న రామాయంపేట మండలం సుతార్‌పల్లి గ్రామంలో శనివారం రాష్ట్ర మలేరియా జోనల్ ఆఫీసర్ సునీల్, అసిస్టెంట్ డైరెక్టర్ నాగయ్య పర్యటించారు. ఇటీవల గ్రామంలో పెద్దసంఖ్యలో గ్రామస్థులు అస్వస్థకు గురైన విషయం తెలిసిందే. కలెక్టర్ ఆదేశాలమేరకు గ్రామంలో క్యాంప్ ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించారు. 157 మంది రక్త నమూనాలను పరీక్షించారు. ఒకరికి డెంగ్యూ, ముగ్గురికి టైఫాయిడ్ ఉన్నట్టు తేలినట్టు నిర్ధారణ అయ్యింది. దీంతో, రాష్ట్ర అధికారుల బృందం గ్రామంలో పర్యటించి పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలజూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ హరిప్రియ, వైద్య బృందం పాల్గొన్నారు.

సుతార్‌పల్లిలో జ్వరంతో బాధపడుతున్నవారితో మాట్లాడుతున్న మలేరియా జోనల్ ఆఫీసర్ సునీల్





ఆత్మహత్యకు యత్నించిన దర్శి లక్ష్మి

భూమి రిజిస్ట్రేషన్ ఆపాలంటూ..

మహిళ ఆత్మహత్యాయత్నం

చౌటకూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఘటన

పుల్‌కల్, జూలై 27: భూమి రిజిస్ట్రేషన్ ఆపాలంటూ ఓ మహిళ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన సంగారెడ్డి జిల్లా చౌటకూర్ తహసీల్దార్ ఆఫీసు వద్ద శనివారం జరిగింది. చౌటకూర్ మండలంలోని సరాఫ్‌పల్లి గ్రామానికి చెందిన దర్శి మల్లేశంకు లక్ష్మితో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. మల్లేశం మరణించడంతో లక్ష్మి అత్తమామలతో కలసి ఉండకుండా అదే గ్రామంలో విడిగా ఉంటున్నారు. మల్లేశం తల్లి దర్శి అనసూయ పేరిట సరాఫ్‌పల్లి గ్రామ శివారులో సర్వే నంబర్ 354/1లో 8 గుంటల భూమి ఉంది. తన పేరిట ఉన్న భూమిని ఇతరులకు విక్రయించేందుకు అనసూయ, భర్త లక్ష్మీనారాయణతో కలిసి శనివారం చౌటకూర్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. విషయం తెలుసుకున్న కోడలు అక్కడికి చేరుకుని భూమి రిజిస్ట్రేషన్ చేయవద్దని ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించారు. కార్యాలయ సిబ్బంది, స్థానికులు అడ్డుకుని లక్ష్మి ఒంటిపై నీళ్ల పోశారు. దీంతో, ఆమె అత్త, మామ రిజిస్ట్రేషన్ చేయకుండానే వెళ్లిపోయారు. అనంతరం దర్శి లక్ష్మి ఇన్‌చార్జి తహసీల్దార్ కిరణ్‌కుమార్‌ను కలిసి తనకు సమాచారం ఇవ్వకుండా భూమిని రిజిస్ట్రేషన్ చేయవద్దని వినతిపత్రం అందజేశారు.

రుణమాఫీ విషయంలో రైతులు అధైర్యపడొద్దు

నిజాంపేట, జూలై 27: రుణమాఫీ విషయంలో రైతులు అధైర్యపడవద్దని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ అన్నారు. మండల పరిధిలోని నార్లాపూర్‌ను శనివారం ఆయన సందర్శించి మాట్లాడారు. గ్రామంలో ఇప్పటివరకు లక్షలోపు రుణం ఉన్న 174 మంది రైతులకు మాఫీ వచ్చిందని, కొన్ని సాంకేతిక కారణాల వల్ల మాఫీ కాని వారు వ్యవసాయ విస్తరణ అధికారులను కలిసి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అమర్ సేనా రెడ్డి, ఏఈవో శ్రీలత, పంచాయతీ కార్యదర్శులు స్రవంతి, రైతులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారంతో జేఎన్‌టీయూ ప్రతిష్టను దిగజార్చొద్దు

పుల్‌కల్, జూలై 27: నిరాధారమైన ప్రచారం చేస్తూ సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రతిష్టను దిగజార్చవద్దని ప్రిన్సిపాల్ జి.నరసింహ కోరారు. శనివారం తన ఛాంబర్‌లో వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావుతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొంతకాలంగా అదే పనిగా కళాశాలపై, తనపై లేనిపోని ఆరోపణలు చేస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 160 ఎకరాల సువిశాలమైన సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు మంచిపేరు ఉందని, ప్లేస్‌మెంట్స్ లభిస్తున్నాయని పేర్కొన్నారు. డబ్బులిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తున్నారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. కళాశాలలో నాలుగేళ్లపాటు కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు ఎవరైనా నో డ్యూ సర్టిఫికెట్ సమర్పించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. కళాశాలలో నాలుగో ఏడాది ఇంజనీరింగ్ పూర్తిచేసిన విద్యార్థులందరూ కూడా అకౌంట్ సెక్షన్ మొదలుకుని అకాడమిక్, ట్యూషన్, స్పెషల్ ఫీజ్, హాస్టల్ సెక్షన్, ఎగ్జామినేషన్ బ్రాంచి, గ్రంథాలయం, హెచ్‌వోడీ, క్రీడలు, ప్లేస్‌మెంట్ సెల్, రవాణ విభాగాలకు సంబంధించి నో డ్యూ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకురావాల్సి ఉంటుందన్నారు. రెగ్యులర్ స్టాఫ్ ఎనిమిది మంది మాత్రమే ఉన్నారని, మిగితా కాంట్రాక్టు ఫ్యాకల్టీ సహకారంతో కళాశాలను అగ్రగామిగా నిలుపుతున్నామన్నారు. తెలంగాణలో కూకట్‌పల్లి జేఎన్‌టీయూ, ఉస్మానియా యూనివర్సిటీ తర్వాత అత్యధిక డిమాండ్ ఉన్నది సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు మాత్రమేనన్నారు. కళాశాలపై, తనపై జరుగుతున్నవి కేవలం తప్పుడు ప్రచారాలేనని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈసీఈ హెచ్‌వోడీ రజనేష్, మెకానికల్ హెచ్‌వోడీ ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహ

బల్దియాలో నయా దందా..!

- ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు
- సర్కారు భూములకు రెక్కలు
- పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం

సదాశివపేట, జూలై 27: సంగారెడ్డి జిల్లా సదాశివపేట బల్దియాలో నయా దందా కొనసాగుతున్నది. ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు ఇచ్చి అధికారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే పట్టణం చుట్టూ ఉన్న రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వానికి చెందిన (కందకం) స్థలాల్లో తిష్టవేసిన ఆక్రమణదారులకు గతంలో, తాజాగా ఇంటి నంబర్లను కేటాయించిన అధికారులు మరో అడుగుముందుకేశారు. పట్టణ పరిధిలోని అనేక ప్రాంతాల్లో భూ యజమాని హక్కు పత్రాలు(డాక్యుమెంట్లు) లేని ఖాళీస్థలాల్లో, ప్రైవేటు వెంచర్లలోని మున్సిపల్‌కు చెందిన పదిశాతం పార్కు స్థలాల్లో, ప్రభుత్వ స్థలాల్లో, మున్సిపల్ అనుమతులు లేకుండా ఏర్పాటుచేసిన అక్రమ వెంచర్లల్లో రోడ్లు, పార్కుల కోసం వదిలేసిన ఖాళీస్థలాల్లో, ప్రైవేటు, సర్కారు వివాదాస్పద భూముల్లో రాత్రికిరాత్రి ఏర్పాటు చేసిన తాత్కాలిక రేకుల షెడ్లు, రేకు డబ్బాల ఫొటోలను చూపుతూ ఇంటి నెంబర్లు కేటాయిస్తున్నారు. బల్దియా అధికారులు కేటాయించిన ఇంటి నంబర్ల ఆధారంగా రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు రిజిస్ట్రేషన్లు చేయడం విమర్శలకు తావిస్తున్నది. ఈ అడ్డగోలు అక్రమాలపై జూన్ 27న సదాశివపేట మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో కొందరు కౌన్సిలర్లు తీవ్రస్థాయిలో అభ్యంతరం తెలిపారు. అక్రమ రిజిస్ట్రేషన్లు, ఖాళీస్థలాల్లో కేటాయించిన ఇంటి నెంబర్లపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సభ్యులు అభ్యంతరం తెలిపిన విషయాలపై సంబంధిత రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు, మున్సిపల్ కమిషనర్ వివరణ ఇచ్చేందుకు నీళ్లు నమిలారు. దీంతో సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే ఒకింత అసహనం వ్యక్తం చేశారు. సభ్యులు అభ్యంతరం తెలిపిన ఖాళీ స్థలాల్లో ఇంటి నంబర్ల కేటాయింపుపై బల్దియా, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖల అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

నిబంధనలకు నీళ్లు..

సదాశివపేట పట్టణాన్ని రాజులు పాలించిన చరిత్ర ఉన్నది. పట్టణానికి ప్రత్యేకంగా గ్రామకంఠం ఉన్నది. గ్రామకంఠం చుట్టూ పట్టణానికి నాలుగువైపులా అప్పట్లో రాజులు మూడు కిలోమీటర్ల మేర 100 ఫీట్ల వెడల్పుతో లోతైన కందకం తవ్వించారు. కాలక్రమంలో అక్రమార్కులు కందకాన్ని పూడ్చివేసి కబ్జాచేశారు. ఇప్పుడు బహిరంగ మార్కెట్‌లో కందకం స్థలం విలువ చదరపు గజం రూ.లక్షలకు పైగా పలుకుతున్నది. దీంతో కొందరు ఆక్రమణదారులు అధికారులను ప్రసన్నం చేసుకుని ఇంటి నంబర్లు పొందగా.. మరికొందరు భారీ వాణిజ్య భవన సముదాయాలు నిర్మించి సొమ్ము చేసుకుంటున్నారు. కందకం స్థలంలో దశాబ్దాల క్రితమే అక్రమాలకు బీజం పడడం విశేషం. ఈ క్రమంలో 2010లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు కందకం స్థలంలో ఉన్న ఆక్రమణలన్నింటినీ తొలగించాలని, కేటాయించిన ఇంటి నంబర్లను రద్దు చేయాలని, ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వొద్దని ఆదేశాలు జారీచేసింది. హైకోర్టు ఆదేశాలు నేటికీ అమలులో ఉన్నా.. అధికారులు ఈ మధ్యకాలంలో కందకం స్థలాల్లో ఇంటి నంబర్లు కేటాయించడం, కందకంలో నిర్మిస్తున్న నిర్మాణాల జోలికి వెళ్లకపోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. ఇదిలావుంటే గ్రామకంఠం లోపల సర్వే నంబర్లు ఉండవు. గ్రామకంఠం చుట్టూ ఉన్న కందకం స్థలం, గ్రామకంఠంలోపల ప్రజాప్రయోజనాల కోసం వదిలేసిన ఉమ్మడి ఖాళీస్థలాలు (పోరంబోకు) స్థలాల జాబితా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉంటాయి. ఇక గ్రామకంఠంలోని ఇళ్లకు,



భవనాలకు, ఇతర ఆస్తులకు ఎలాంటి డ్యాకుమెంట్లు ఉండవు. కేవలం ఇంటి నంబర్లు మాత్రమే ఉంటాయి. మున్సిపల్ రెవెన్యూ విభాగంలో అసిస్‌మెంట్ రికార్డుల్లో ఇంటినెంబర్లు, ఆస్తుల యజమానుల పేర్లు, ఆస్తికి సంబంధించిన కొలతలు నమోదై ఉంటాయి. వీటి ఆధారంగా ఆస్తుల రిజిస్ట్రేషన్లు, మ్యూటేషన్లు జరుగుతాయి. ఈ మధ్యకాలంలో గ్రామకంఠం లోపల ఉన్న కొన్ని ప్రైవేటు ఆస్తులకు సంబంధించి రిజిస్ట్రేషన్లు జరగకపోయినా సదరు ఖాళీస్థలాల్లో ప్రస్తుత ఆక్రమణదారు అని పేర్కొంటూ బల్దియా ఇంటి నెంబర్లు కేటాయించడం గమనార్హం. మరోవైపు గ్రామకంఠం బయట ఉన్న భూములకు రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నంబర్లు, భూమి యాజమాన్యం పత్రాలు, పట్టాదారు పాసుపుస్తకాలు ఉంటాయి. ఒకవేళ వ్యవసాయ భూములను వెంచర్లుగా ఏర్పాటు చేస్తే (సర్వే నంబర్, ప్లాట్ నంబర్లు) ఉంటాయి. కానీ మున్సిపల్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖలు బల్దియా పరిధిలో చాలాచోట్ల ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలకు, సర్వే నంబర్లు లేకుండా ఇంటి నెంబర్లు కేటాయించడం, ఆ ఇంటి నంబర్లను రిజిస్ట్రేషన్ల శాఖ రిజిస్ట్రేషన్ చేయడం, రిజిస్ట్రేషన్లను బల్దియా యంత్రాంగం మ్యూటేషన్ చేసి ఆమోదించడం వంటివి ఆన్‌లైన్‌లోనే జరిగిపోవడం గమనార్హం. కలెక్టర్ పట్టించుకుని చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఇటీవల జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో కౌన్సిలర్లు ఖాళీస్థలాలకు ఇంటి నెంబర్ల కేటాయించిన విషయాలను ప్రస్తావించారు. కమిషనర్‌గా నేను బాధ్యతలు చేపట్టిన తరువాత ఖాళీస్థలాలకు ఇంటి నెంబర్లు ఎక్కడా కేటాయించలేదు. ఈ విషయంలో పూర్తిస్థాయిలో విచారణ జరిపించి తగు చర్యలు తీసుకుంటాం.

- జె.ఉమా, మున్సిపల్ కమిషనర్

వేధింపులు తాళలేక గృహిణి ఆత్మహత్య



హర్షిత మృతదేహం

పటాన్‌చెరు, జూలై 27: ప్రేమ పెళ్లి చేసుకున్న ఐదునెలకే భర్త కట్నం వేధింపులు తాళలేక గృహిణి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పటేల్‌గూడా సిద్ధార్థ కాలనీలో చోటు చేసుకున్నది. అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా శ్రీనివాస్‌రావుపేటలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కొరివి అనిల్‌కుమార్ కుమార్తె కొరివిహర్షిత(22).. అదే జిల్లా ఎడ్లపాడు గ్రామానికి చెందిన అంగిడి మహేష్(25)ను ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రేమ వివాహం చేసుకున్నది. పెళ్లి సమయంలో రూ.3 లక్షల కట్నం సైతం మహేష్‌కు ముట్టజెప్పారు. నాలుగు నెలల క్రితం పటేల్ గూడ సిద్ధార్థ కాలనీలో దంపతులు అద్దెకు దిగారు. కాగా మహేష్‌కు ఉద్యోగం లేకపోవడంతో ప్రతీనెల రూ.30 వేలను అనిల్‌కుమార్ పంపిస్తున్నాడు. ఇటీవల మహేష్‌కు బెంగుళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చింది. అయినా ప్రతినెల డబ్బులు పంపాలని, ఆస్తిలో వాటా రాసివ్వాలని భార్య హర్షితను మానసికంగా, శారీరకంగా వేధించడం ప్రారంభించాడు. మహేష్ వేధింపులు తట్టుకోలేక శుక్రవారం రాత్రి గదిలోని కిటికీకి చున్నీతో ఉరేసుకుని హర్షిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

చెప్పులు, బ్యాగ్ కొనివ్వలేదని విద్యార్థిని ఆత్మహత్య



బుష్రాఫాతిమ మృతదేహం

పటాన్‌చెరు, జూలై 27: కొత్త చెప్పులు, కాలేజీ బ్యాగ్ కొనివ్వలేదని తల్లితో గొడవపడి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రాజీవ్ స్వగృహలో నివాసముండే బుష్రాఫాతిమ(18) డిగ్రీ చదువుతోంది. శనివారం ఉదయం ఫాతిమ తనకు కొత్తచెప్పులు, కాలేజీ బ్యాగ్ కొనివ్వాలని తల్లి జారీనాబేగంతో గొడవపడింది. త్వరలో కొనిస్తానని తల్లి చెప్పడంతో అలిగి గదిలోకి వెళ్లి గడియపెట్టుకుంది. ఎంత పిలిచినా తలుపు తెరవకపోవడంతో భర్త సయ్యద్‌జావేద్‌కు ఫోన్‌చేసి చెప్పింది. ఇంటికి చేరుకున్న జవేద్ తలుపులు బద్దలు కొట్టి చూడగా ఫాతిగా ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఇద్దరు అంతర్‌జిల్లా దొంగల అరెస్ట్

- నిందితుల నుంచి బంగారం, విదేశీ కరెన్సీ స్వాధీనం

పటాన్‌చెరు, జూలై 27: తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్‌జిల్లా దొంగలు అమీన్‌పూర్ పోలీసులకు చిక్కారు. శనివారం పటాన్‌చెరు పోలీసు సబ్ డివిజన్ కార్యాలయంలో డీఎస్పీ రవీందర్‌రెడ్డి, అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఐడీఏ బొల్లారంలో నివాసముండే యూపీవీసీ కిటికీలు తయారు చేసే రవి, పెయింటింగ్ పనిచేసే సోమశేఖర్ కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నారు. పగలు పనిచేసుకుంటూ తాళం వేసిన ఇళ్ల వివరాలను సేకరించి దోపిడీలకు పాల్పడేవారు. గతనెల 28న అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లింగమయ్య కాలనీలో నివాసముండే లిఖిత్‌పవన్ అనే వ్యాపారి ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి అరుణాచలం వెళ్లారు. తాళం పగులగొట్టి బీరువాలోని బంగారం, వెండి ఆభరణాలను దొంగిలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితులను అరెస్ట్ చేశారు. వీరు గతంలో బొల్లారం, దుండిగల్, అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 7 దొంగతనాలకు పాల్పడ్డారని విచారణలో తేలింది. నిందితుల నుంచి 10 తులాల బంగారం, వెండి సామగ్రి, విదేశీ కరెన్సీ, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. దొంగలను అరెస్ట్ చేయడంతో చాకచక్యం ప్రదర్శించిన అమీన్‌పూర్ పోలీసులను డీఎస్పీ అభినందించారు.

చెట్టుకు బైక్ ఢీకొని యువకుడి మృతి



సాయికుమార్ (ఫైల్)

ములుగు, జూలై 27: బైక్ అదుపు తప్పి చెట్టుకు ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన కొత్తూరు గ్రామ సమీపంలో జరిగింది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ వివరాల ప్రకారం.. ములుగు గ్రామానికి చెందిన బుల్లి సాయికుమార్(22) శుక్రవారం సాయంత్రం తన స్నేహితుడు తిగుళ్ల శివకుమార్ ఇంటికి రాగా.. ఇద్దరూ బైక్‌పై బయటకు వెళ్లారు. రాత్రి 12 గంటల సమయంలో మండల పరిధిలోని కొత్తూరు గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొనగా పడిపోయారు. ఈ ఘటనలో సాయికుమార్ అక్కడికక్కడే మృతిచెందగా.. శివకుమార్‌కు గాయాలయ్యాయి. సాయికుమార్ డీసీఎం డ్రైవర్‌గా పనిచేసేవాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి అశోక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

సంగారెడ్డిలో 'సకురా జపాన్'



సంగారెడ్డి అర్బన్: సంజయ్‌ను సన్మానిస్తున్న జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి

సంగారెడ్డి అర్బన్/సిద్దిపేట క్రైం, జూలై 27: సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ సెంటర్‌లో సకురా జపాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లాస్థాయిలో విద్యార్థులకు టెస్ట్ నిర్వహించారు. జిల్లాలోని కేజీబీవీ, మోడల్ స్కూల్, టీఆర్ఈఐఎస్ పాఠశాలల నుంచి 16 మంది విద్యార్థులు టెస్ట్‌కు హాజరయ్యారు. ఈ టెస్ట్‌లో బస్వాపూర్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థి పి.సంజయ్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. జిల్లా నుంచి ఎంపికైన ఒక్కో విద్యార్థి, ఇలా 33 జిల్లాల నుంచి చివరగా ఐదుగురిని ఎంపిక చేసి, నవంబర్ 10 నుంచి 16వ తేదీవరకు జపాన్‌లో జరిగే సకురా సైన్స్ కార్యక్రమానికి ఎంపికచేసి జపాన్‌కు తీసుకెళ్లనున్నారు. ఎంపికైన విద్యార్థి సంజయ్‌ను డీఈవో వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, గైడ్ టీచర్లు, ప్రధానోపాధ్యాయులు అభినందించారు. అలాగే సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం లచ్చపేట మోడల్ స్కూల్ విద్యార్థిని సృజన రాష్ట్రస్థాయికి ఎన్నికైనట్లు జిల్లా సైన్స్ అధికారి కల్లేపల్లి శ్రీనివాస్ తెలిపారు. సృజనను సిద్దిపేటలోని మల్టీపర్పస్ స్కూల్‌లో అభినందించారు.

ఆపదలో ఆపన్నహస్తం.. డయల్ 100

- మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, జూలై 27: ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తంలా డయల్ 100 పనిచేస్తుందని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బ్లూకోట్స్, పెట్రో కార్ సిబ్బందితో డయల్ 100 కాల్స్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, మనతీరు జనం మెచ్చేలా ఉండాలనే ఉద్దేశంతో పోలీసు విభాగం కొన్ని వ్యవస్థల్ని ఏర్పాటు చేసిందన్నారు. అందులో భాగంగా 100 నెంబర్‌తో కంట్రోల్ రూంను అందుబాటులోకి తెచ్చిందన్నారు. 100 విధానానికి మరింత సాంకేతిక పరిజ్ఞానం, పారదర్శకత, జవాబుదారీతనం జోడించిందని చెప్పారు. ప్రతి ఫోన్‌కాల్‌ను రికార్డు చేసే సిబ్బంది, వెంటనే ఆ సమస్య పరిష్కారమయ్యాకే దాన్ని క్లోజ్ చేస్తారన్నారు. అత్యవసర, విపత్కర పరిస్థితుల్లో పోలీసుల సహాయం కావాలనుకునేటప్పుడు తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు.

పురుగుల అన్నం ఎలా తినాలి..?



ఉపాధ్యాయులు, వంట కార్మికులతో వాగ్వివాదానికి దిగిన విద్యార్థులు

మిరుదొడ్డి, జూలై 27: పురుగుల అన్నం ఎలా తినాలంటూ విద్యార్థుల ఉపాధ్యాయులు, వంటకార్మికులతో వాగ్వివాదం దిగిన సంఘటన శనివారం మిరుదొడ్డి మండలం చెప్యాల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చోటుచేసుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలనే ఉద్దేశంతో పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందిస్తున్నదని, కానీ వంట కార్మికులు, ఉపాధ్యాయులు నిర్లక్ష్యం మూలంగా పురుగుల అన్నమే వడ్డిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనంలో పురుగుల వస్తున్నాయని ఉపాధ్యాయులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పురుగులు లేని అన్నం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

రేగోడ్ కేజీబీవీలో జడ్పీ సీఈవో తనిఖీ

రేగోడ్, జూలై 27: రేగోడ్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శనివారం జడ్పీ సీఈవో ఎల్లయ్య ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించి మాట్లాడారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. ప్రధానంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నదని, జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ

మాసాయిపేట, జూలై 27: వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. శనివారం మాసాయిపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. వివిధ గ్రామాల పహాని వివరాలు సరిగ్గా ఉన్నాయానని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, పిల్లలు హాజరుశాతంపై అంగన్‌వాడీ టీచర్ భూదేవిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలలోని నాలుగవ తరగతిని సందర్శించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. అలాగే మండలంలోని పలు వీధుల్లో పర్యటించి రైతులు, ప్రజలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జ్ఞానజ్యోతి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ ధన్‌సింగ్, గ్రామ కార్యదర్శి రాణమ్మ, రెవెన్యూ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



మాసాయిపేట మండల కేంద్రంలో ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

రైల్వే బ్రిడ్జి పరిశీలన

మాసాయిపేట, జూలై 27: మాసాయిపేటలోని చెట్ల తిమ్మాయపల్లి చౌరస్తా వద్ద గల రైల్వే అండర్ బ్రిడ్జి మార్గాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు శనివారం పరిశీలించారు. నాలుగేళ్లుగా కొనసాగుతున్న బ్రిడ్జి పనులతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బ్రిడ్జి ప్రదేశానికి వెళ్లి పరిశీలించి వెంటనే రిపోర్టు పంపించాలని కలెక్టర్ ఆదేశించారు.

నాచగిరిలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం



ఆలయ మండపంలో విష్ణు సహస్రనామర్చణ పారాయణం చేస్తున్న సేవాసమితి బృందం

వర్గల్, జూలై 27: ఆషాఢమాసం చివరి శనివారం పురస్కరించుకుని వర్గల్ మండలం నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో శ్రీవిష్ణు సహస్ర పారాయణ సత్సంగ సమితి, భ్రమరాంబిక సేవాసమితి ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామర్చణ పారయణం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ ముందుగా స్వామివారి చిత్రపటానికి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ మండపంలో సుమారు వందమందిచే రెండు గంటలపాటు విష్ణు సహస్రనామార్చణ పారాయణం కొనసాగింది. కార్యక్రమం అనంతరం సేవాసమితి బృందం సభ్యులు ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణను సన్మానించారు. విష్ణు సహస్రనామర్చణ పారాయణం నిర్వహించినందుకు శ్రీవిష్ణు సహస్ర పారయణ సత్సంగ సమితి అధ్యక్షుడు కొండ సూర్యనారయణ, భ్రమరాంబిక సేవాసమితి అధ్యక్షులడు మహాలక్ష్మిని ఆలయ కార్యనిర్వహణ అధికారి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులతో పాటు ఆలయ సిబ్బంది, భక్త బృందం పాల్గొన్నారు. సహస్ర పారాయణం సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తిపారవశ్యమయ్యాయి.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

- 50 గ్రాముల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

వర్గల్, జూలై 27: వర్గల్ మండలం చాంద్‌ఖాన్ మక్త గ్రామ సమీపంలో గంజాయిని విక్రయిస్తున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్, గౌరారం పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 50 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం, మాదేవురా జిల్లా, యోగిరాజ్ గ్రామానికి చెందిన వినయ్‌కుమార్ మైలారం గ్రామ సమీపంలోని శ్రీవాణి రైస్‌మిల్‌లో హమాలిగా పనిచేస్తుంటాడు. గత శుక్రవారం వర్గల్ మండలం చాంద్‌ఖాన్ మక్త గ్రామ శివారులోని పెద్దమ్మ ఆలయం వద్ద గంజాయిని విక్రయిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ జానకీరాంరెడ్డి, గౌరారం ఎస్ఐ ఆధ్వర్యంలో వెళ్లి పట్టుకుకోగా భయాందోళన చెందాడు. బైక్ టూల్ బాక్స్‌లోని ప్లాస్టిక్ కవరులో ఉన్న గంజాయిని, ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. బీహార్ రాష్ట్రం, భగల్‌పూర్ జిల్లా తోఫ్ర గ్రామానికి చెందిన వీరుచౌదరి వద్ద గంజాయిని కొనుగోలు చేసి తాను తాగుతూ మిగిలిన దానిని వర్గల్ చుట్టుపక్కల గ్రామాల యువకులకు, కార్మికులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు.

సొంతూరిలో దొంగతనం.. పక్క జిల్లాలో అరెస్ట్



జ్ఞానేశ్వర్‌ను అదుపులోకి తీసుకుంటున్న సీఐ రేణుకారెడ్డి

చేర్యాల, జూలై 27: దొంగతనానికి పాల్పడిన మెదక్ జిల్లా రేగోడు మండలం ముక్తవెంకటాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తిని పోలీసులు శనివారం చేర్యాలలో అదుపులోకి తీసుకున్నారు. ముక్తవెంకటాపూర్ గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్ మిషన్ భగీరథ సిబ్బందిగా పనిచేస్తూ చేర్యాల పట్టణంలోని పెట్రోల్ పంపు ఏరియాలో అద్దెకు ఉంటున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వెళ్లిన జ్ఞానేశ్వర్ ఈనెల 25న తాళంవేసిన ఇంట్లో చోరీకి పాల్పడి రూ.2.15 లక్షల విలువైన నగదు, బంగారం అపహరించాడు. ఈ విషయమై అక్కడ కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టిన క్రమంలో జ్ఞానేశ్వర్‌ను నిందితుడిగా గుర్తించారు. దీంతో అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి శనివారం చేర్యాలలో అద్దెకు ఉంటున్న ఇంట్లో సోదాలు నిర్వహించి రూ.1.20 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. జ్ఞానేశ్వర్‌తో పాటు అతడి భార్యను కూడా అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

మున్సిపల్ ఆదాయానికి గండి

- షాపింగ్ కాంప్లెక్స్ వేలం పాటలో మాయాజాలం
- కుమ్మక్కైన పాటదారులు
- నామమాత్రపు ధరలకే దక్కించుకున్న వైనం



వేలంపాట ధరలను పెంచమంటూ పాటదారులను కోరుతున్న కౌన్సిలర్ చిట్టిబాబు

జోగిపేట, జూలై 27: అందోలు-జోగిపేట మున్సిపాలిటీ ఆదాయంలో భారీ గండి పడింది. వేలం పాటదారులు కుమ్మక్కై, నామమాత్రపు అద్దెకే పాటపాడి బల్దియాకు రావాల్సిన ఆదాయానికి గండికొట్టారు. అందోలు-జోగిపేట మున్సిపాలిటీకి జోగిపేటలోని గాంధీపార్కు వద్ద 12 దుకాణాలతో కూడిన షాపింగ్ కాంప్లెక్స్ ఉన్నది. ఇందులో 9వ దుకాణానికి మరమ్మతులు ఉండగా.. మిగిలిన 11 దుకాణాలకు శనివారం బల్దియా సమావేశ మందిరంలో వేలం పాటలు నిర్వహించారు. సాక్షాత్తు చైర్మన్ మల్లయ్య, కమిషనర్ తిరుమల సమక్షంలోనే వేలం పాటదారులు నామమాత్రపు ధరలకే వేలం పాడడంతో అంతా అవాక్కయ్యారు.

శుక్రవారమే కుమ్మక్కు

కాగా వేలంపాట విషయంలో పాటదారులంతా... శుక్రవారమే కుమ్మక్కైయ్యారు. పైరవీకారులు కొందరు మధ్యవర్తిత్వం చేసి... పట్టణ శివార్లలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పాటదారులను పిలిచి సమావేశం నిర్వహించారని సమాచారం. ఎక్కువకు పాడి మున్సిపాలిటీకి లాభం కల్పించడం ఎందుకు నామమాత్రపు ధరలకు పాడుకుని వచ్చే ఆదాయం మనమే పంచుకుందామని పాటదారులకు సర్దిచెప్పడం విశేషం.

ప్రతీ పాటదారునికి రూ.25 వేలు

బిడ్లు వేసిన ప్రతీ పాటదారుడికి కనీసం రూ.25 వేలు దక్కేలా పైరవీకారులు పథక రచన చేశారు. కొన్ని దుకణాలకు 10 మందికిపైగా బిడ్లు రావడం, మరికొన్నింటికి నలుగురే రావాలని పథకం వేశారని తెలిసింది. ఎక్కువమంది పాటదారులున్న చోట దుకాణం దక్కించుకోవాలనుకున్న పాటదారుడు.. తాను కాకుండా మిగిలిన పాటదారులకు ఒక్కొక్కరికీ రూ.25 వేలు చెల్లించాలని నిర్ణయం జరిగింది. దాని ప్రకారం.. 9 మందికి రూ.2.25 లక్షలు చెల్లించారని సమాచారం. ప్రతిసారి కేవలం రూ.100 చొప్పున పెరుగుతూ.. అసలు దుకాణదారుడు అనుకున్న ఫిగర్ రాగానే, మిగతావారంతా పోటీ నుంచి తప్పుకున్నారు. ఇప్పటికే ఆయా షాప్‌లలో వ్యాపారాలు సాగిస్తున్నవారు, సెటప్ అయిన తమ వ్యాపారానికి ఇబ్బంది కలుగకూడదని ఏకంగా రూ.3 లక్షలు చెల్లించినట్లు సమాచారం.

షాప్ నెంబర్-2కు అధిక పోటీ

ఇదిలా ఉంటే.. 11 దుకాణాలలోని 2 నెంబరు దుకణానికి మాత్రమే వేలం పాటదారులు రింగ్ కాలేకపోయారు. ఈ దుకాణానికి ఎనిమిది మంది పోటీపడగా, అత్యధికంగా రూ.19,300లకు అరుణ్ తేజ్‌గౌడ్ అనే బిల్డర్ పాటపాడి దక్కించుకున్నాడు. మిగతా దుకాణాలన్నీ సర్కారు వారి పాట రూ.10 వేలకు కొంచెం అటుఇటుగానే పాడారు. షాప్ నెంబర్-2 మినహాయిస్తే.. అత్యధికంగా బిడ్ పాడిన ధర కేవలం రూ.10,900 (షాప్‌నెంబర్ -1) కావడం గమనార్హం.

పాటదారుల స్థానంలో.. ఇతరుల బిడ్డింగ్

నిబంధనల మేరకు ఒక్కో వ్యక్తి ఎన్ని దుకణాలకైనా వేలం పాటలో పాల్గొనవచ్చు. ఒకటి కంటే ఎక్కువ దుకాణాలు పొందకూడదు. కానీ ఓ వ్యక్తి నిబంధనలకు రెండు దుకాణాలను దక్కించుకోవడం గమనార్హం. వేలం పాటకు డీడీలు చెల్లించిన వ్యక్తే పాల్గొనాలి. కానీ అతనికి బదులుగా, వారి కుటుంబసభ్యులు, స్నేహితులు పాల్గొన్నారు. ఇది ఒక ఎత్తైతే.. వేలంపాటదారుల సంతకాలను కూడా వారే పెట్టడం విశేషం. 1వ వార్డు కౌన్సిలర్ డాకూరి శివశంకర్, 17వ వార్డు కౌన్సిలర్ చిట్టిబాబులు మాత్రమే అధిక ఆదాయం రావాలని పట్టుబట్టారు. కానీ అటు చైర్మన్ కానీ, ఇటు కమిషనర్ కానీ ఏమాత్రం స్పందించకపోవడం విడ్డూరం. ఏకంగా కౌన్సిలర్ల కుటుంబసభ్యులే, తమ కుటుంబంలోని ఇతర సభ్యుల పేర్లపై బిడ్లు వేసి పాల్గొనడం మరీ దారుణం. మూడేళ్ల క్రితం ప్రతీ దుకాణానికి రూ.6 వేలను సర్కారు వారి పాటగా నిర్ణయించారు. అత్యధికంగా రూ.20,500కు బిడ్ కాగా, ఈసారి సర్కారు వారి పాట రూ.10 వేలకు పెరిగినా వేలంలో కేవలం ఒక్కషాపు మినహా మిగతావన్నీ సర్కారువారి పాటకు కొంచెం అటుఇటుగా పాడడం గమనార్హం.

దుకాణాలు దక్కించుకున్నవారు

షాప్ నెంబర్ -1 తుపాకుల క్రిష్ణ రూ.10,900, షాప్ నెంబర్-2 అరుణ్ తేజ్‌గౌడ్ రూ.19,300, షాప్ నెంబర్-3 సునేరియా వివేక్ రూ.10,600, షాప్ నెంబర్-4 అర్థం లక్ష్మీ రూ.10,500, షాప్ నెంబర్-5 జట్ల లక్ష్మి రూ.10,700, షాప్ నెంబర్-6 వుల్వల శ్రావణి రూ.10,400, షాప్ నెంబర్-7 సునేరియా వివేక్ రూ. 10,700, షాప్ నెంబర్-8 రాంప్రసాద్ రూ.10,200, షాప్ నెంబర్-9 (ఎవరూ పాడలేదు), షాప్ నెంబర్-10 తుపాకుల నాగరాజు రూ.10,300, షాప్ నెంబర్-11 సోమ సీనయ్య రూ.10,300, షాప్ నెంబర్-12 హన్మంత్‌గారి లావణ్యరూ.10,300 వేలకు పాడారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు



సంగారెడ్డి సెంట్రల్ జైలులో ఖైదీలతో మాట్లాడుతున్న జాతీయ న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్

కంది, జూలై 27: జిల్లా న్యాయసేవాధికార సంస్థలో తమకు న్యాయవాదులు లేరని అర్జీ పెట్టుకున్న ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తామని జాతీయ న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల ప్రకారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర ఆదేశాల మేరకు జాతీయ న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ శనివారం కంది పరిధిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలును ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాతీయ న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి జైలులోని అన్ని బ్లాకులను, వంటశాల, బాత్‌రూమ్‌లు, జైలు ఆవరణ మొత్తం తిరిగి పరిశీలించారు. ఖైదీలకు సరఫరా చేసే భోజనం, సదుపాయాల గురించి జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందించే ఆహారాన్ని జిల్లా జడ్జి పరిశీలించారు. వంటశాలలో ఖైదీల కోసం వండే కూరగాయలు, బియ్యం, పప్పుదినుసులను తనిఖీ చేశారు. అనంతరం ఖైదీలతో ఆయన మాట్లాడుతూ సమయానికి బెయిల్స్, ములాఖత్ అందుతున్నాయా అని ఆరా తీశారు. కేసులు త్వరగా పరిష్కరించేందుకు న్యాయవాదులు లేనివారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో అర్జీ పెట్టుకుంటే, వారి తరపున న్యాయవాదులను నియమిస్తామన్నారు. ఆకస్మిక తనిఖీలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జైలు సూపరింటెండెంట్ దండా భరత్‌రెడ్డి, కోర్టు సిబ్బంది, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నరకప్రాయంగా రోడ్లు

- గుంతలమయంగా హత్నూర- జోగిపేట రోడ్డు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- వర్షాలకు గుంతల్లో నీరు చేరడంతో ప్రయాణించాలంటే జంకుతున్న వాహనదారులు





హత్నూర సమీపంలో రోడ్డుపై గుంతల్లో వర్షం నీరు, సికింద్లాపూర్‌లో బురదమయంగా రోడ్డు

హత్నూర, జూలై 27: మండలంలోని ప్రధాన రహదారులు గుంతలమయమై అధ్వానంగా తయారయ్యాయి. పట్టించుకునే నాథుడే లేక తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆ రోడ్లపై వెళ్లాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. మండల కేంద్రమైన హత్నూర నుంచి జోగిపేటకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారిపోయింది. హత్నూర సమీపంలో భారీ గుంతలు, ఐటీఐ కాలనీ సమీపంలో సుమారు 200 మీటర్ల వరకు రోడ్డు మొత్తం గుంతలమయంగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా అధికారులు, నాయకులు ఎవరూ పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్యాల వెళ్లే ప్రధాన రహదారి సైతం అధ్వానంగా మారి తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దౌల్తాబాద్ నుంచి నాగుల్దేవులపల్లి వెళ్లే ప్రధాన రహదారి సైతం గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. హత్నూర నుండి నవాబుపేట వెళ్లి రహదారి పూర్తిగా ధ్వంసం అయిపోయింది. సంగారెడ్డి నర్సాపూర్ ప్రధాన రహదారిపై గుండ్లమాచునూర్ గ్రామ శివారులో ఎపిటోరియా యూనిట్-3 పరిశ్రమ వద్ద ఏర్పడ్డ గుంతలతో వాహనదారులు అనేక ఇబ్బందులకు గురువుతున్నారు. ఇలా మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు పూర్తిగా అధ్వానంగా మారి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మల్కాపూర్ నుంచి పటాన్‌చెరు వెళ్లే ప్రధాన రహదారి సైతం గుంతలమయంగా మారడంతో ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడ్డ సంఘటనలు కూడా ఉన్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా రోడ్ల మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై వెళ్లాలంటేనే భయం



హత్నూర-సిరిపురం రోడ్డుపై వెళ్లాలంటే ఏ గుంతలో పడి ప్రమాదం సంభవిస్తుందోనని భయం గా ఉంది. రెండు, మూడు నెలల క్రితమే రోడ్డు మరమ్మతులు చేసినా, నాణ్యత పాటించకపోవడంతో తిరిగి పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు చేరి వాహనదారులకు ప్రమాదకరంగా మారింది.

- సుధాకర్, నాగులదేవులపల్లి మాజీ సర్పంచ్

అధికారులు స్పందించాలి



ప్రధాన రహదారులపై ఏర్పడ్డ గుంతలను వెంటనే అధికారులు స్పందించి మరమ్మత్తులు చేయించాల్సిన అవసరం ఉంది. లేకుంటే రోడ్డుపై ఏర్పడ్డ గుంతల నీరు ఉండడం వల్ల ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉంది. రాత్రిపూట బైక్‌పై వెళ్లేవారు గుంతలో పడిన సందర్భాలు కూడా ఉన్నాయి.

- చంద్రమోహన్, దౌల్తాబాద్‌వాసి

గురుకులంలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం



గాయపడిన అర్చన

పటాన్‌చెరు రూరల్, జూలై 27: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ముత్తంగిలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకులం విద్యార్థిని శనివారం ఆత్మహత్యకు యత్నించింది. జిల్లాలోని న్యాల్‌కల్ మండలం బసంత్‌పూర్ గ్రామానికి చెందిన అర్చన (16) ముత్తంగి మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. నెల క్రితమే గురుకులంలో చేరిన ఆమెకు హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక వారం క్రితం తండ్రికి ఫోన్ చేసి ఇంటికి వచ్చేస్తానని చెప్పింది. దీనికి కళాశాల అధికారులు అనుమతి ఇవ్వలేదని తండ్రి తెలిపారు. ఈ నేపథ్యంలో హాస్టల్‌లోని మూడో అంతస్తు నుంచి దూకి అర్చన ఆత్మహత్యకు యత్నించింది. కాలు విరిగి వెన్నెముకకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో వలస కార్మికుడి మృతి



మృతి చెందిన కార్మికుడు సంతోష్

పటాన్‌చెరు, జూలై 27: పటాన్‌చెరు పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో పని చేస్తున్న ఒరిస్సా కార్మికుడు శనివారం ఉదయం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. పారిశ్రామికవాడలోని ఆల్విన్ కాలనీ సమీపంలోని సంతోష్ (34)నవరత్న అల్లాయిస్ ఫ్యాక్టరీలో ఉదయం పనిచేస్తుండగా కార్మికుడు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్ ఫ్యాక్టరీకి చేరుకుని కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. కార్మికుడి కుటుంబానికి రూ.5 లక్షల నగదు, అంత్యక్రియలకు రూ.50వేల ఆర్థికసాయం చేసేందుకు యాజమాన్యం అంగీకరించింది.

అనుమానాస్పద స్థితిలో మహిళ..



చింతలక్ష్మి(ఫైల్)

తూప్రాన్, జూలై 27: తూప్రాన్ పట్టణ పరిధి వెంకటాపూర్ (పీటీ) గ్రామానికి చెందిన చింత లక్ష్మి అనుమానస్పదస్థితిలో మృతిచెందినట్లు ఎస్ఐ శివానందం తెలిపారు. పట్టణంలో నివాసముంటున్న లక్ష్మి అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. లక్ష్మి మృతిపై సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలకు చెందిన సోదరుడి భార్య నందాల్య సువర్ణరెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఐదు కార్లు ఢీ.. తప్పిన ప్రమాదం



కార్లు ఢీకొని స్తంభించిన ట్రాఫిక్

కంది, జూలై 27 : కందిలోని 65వ నంబరు జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం ఒకదాని వెనుక ఒకటి మొత్తం ఐదు కార్లు ఢీ కొన్నాయి. ఐదు కార్ల ముందు వెనక భాగాలు దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే జాతీయ రహదారిపై దాదాపు ఒక కిలోమీటరు మేర గంటన్నర పాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది.

గంజాయి సాగు చేస్తే ప్రభుత్వ పథకాలు నిలిపివేత

కల్హేర్, జూలై 27: మండలంలో గంజాయి సాగు చేసినా, రవాణా చేసి విక్రయించినా కఠిన చర్యలు తప్పవని, అలాగే ఆ కుటుంబానికి ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు పూర్తిగా నిలిపివేయబడతాయని సిర్గాపూర్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. వీరిపై ప్రత్యేక నిఘా ఉంచనున్నట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా గంజాయి సాగు చేసే విషయం తెలిస్తే పోలీసు వారికి సమాచారం ఇస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు

నిజాంపేట, జూలై 27: విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని ప్రతిభను వెలికి తీసేవి క్విజ్ పోటీలను నిర్వహించడం వల్ల నేర్చుకోవాలన్న జిజ్ఞాస విద్యార్థుల్లో పెరుగుతుందని రామంపేట సీఐ వెంకటరాజుగౌడ్ పేర్కొన్నారు. మండలం కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లోని సిలబస్‌తో పాటు జనరల్ నాలెడ్జి కరెంట్ అఫైర్స్ తెలుసుకునేందుకు ఈ క్విజ్ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. అలాగే మాదకద్రవ్యాలు సైబర్ నేరాలు గురించి అవగాహన కల్పిస్తూ వాటి వలన సంభవించి దుష్పరిణామాలను విద్యార్థులు తెలియజేశారు. అనంతరం క్విజ్ లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన ఉపాధ్యాయురాలు జ్ఞానమాల, ఉపాధ్యాయులు మహేందర్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర సహాయమంత్రిని నర్సాపూర్‌లో కలిసిన నాయకులు



నర్సాపూర్‌లో కేంద్ర సహాయ మంత్రికి స్వాగతం పలుకుతున్న నాయకులు

నర్సాపూర్, జూలై 27: కేంద్ర సహాయమంత్రి రాందాస్‌అత్వాలే శనివారం హైదరాబాద్ నుంచి మెదక్‌లో కార్యక్రమానికి నర్సాపూర్ మీదుగా వెళ్తున్న క్రమంలో నర్సాపూర్ పట్టణ సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద బీజేపీనాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సహాయ మంత్రి నాయకులు నిలుచున్న చోట తమ కాన్వయ్‌ను ఆపగా ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు అంజిగౌడ్, నాయకులు ఉన్నారు.

తపాలాశాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- సంగారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ త్రిపాఠి

పెద్దశంకరంపేట, జూలై 27: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ తపాల శాఖ ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని తపాలా శాఖ సంగారెడ్డి సబ్‌డివిజన్ ఏఎస్పీ త్రిపాఠి పేర్కొన్నారు. పెద్దశంకరంపేట మండల పరిధిలోని బుజ్రాన్‌పల్లి గ్రామంలో తపాలా సేవల సమీకృత సమ్మేళనం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో గ్రామస్థులకు తపాలా శాఖ ద్వారా అందిస్తున్న సేవల గురించి వివరించారు. సుకన్య సమృద్ధి యోజనపథకం ఆడ పిల్లలకు వరం లాంటిదన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్‌పీఎల్, పీఎల్ఐ, ఆర్‌డీ, ఎస్‌బీ తదితర పథకాల గురించి క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో సంగారెడ్డి సబ్‌డివిజన్ మేయిల్ ఓవర్సీస్ శ్రీనివాస్ శంకర్, ఎస్‌పీఎం రఘు, మాజీ సర్పంచు విఠల్, తపాలాశాఖ ఉద్యోగులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో జాతీయ స్థాయికి ఎదగాలి: డీఈవో

మెదక్ అర్బన్, జూలై 27: ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థుల్లోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసి, మంచి శిక్షణతో జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదిగేలా వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ సూచించారు. శనివారం స్థానిక వెస్లీ పాఠశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లాలోని డైరెక్టర్స్, పీఈటీలకు నిర్వహించిన సమావేశానికి డీఈవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్, ఫిజికల్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కుక్కలు, కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలి

- నర్సాపూర్ మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ల విజ్ఞప్తి

నర్సాపూర్, జూలై 27: పట్టణంలో ఏ వార్డులో చూసినా కోతులు, కుక్కలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని ప్రజలను వాటి నుంచి కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పట్టణంలో కోతులు, కుక్కల బెడద తీవ్రంగా ఉందని, వాటి బారిన పడి రోజూ ఎవరో ఒకరు గాయాలకు గురవుతున్నారన్నారు. ఇందుకు చైర్మన్ అశోక్‌గౌడ్ స్పందిస్తూ ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, కలెక్టర్ నుంచి తగిన సూచనలు తీసుకుని నిర్ణయిద్దామని పేర్కొన్నారు. సమావేశంలో ప్రతీ శుక్రవారం సంతను పాత మార్కెట్ రోడ్డులో గాంధీ విగ్రహం నుంచి ఎస్‌బీఐ వరకు నిర్వహించాలని నిర్ణయించినట్లు చైర్మన్ తెలిపారు. అదే విధంగా శుక్రవారంతో పాటు మంగళవారం కూడా సంత నిర్వహించాలని తీర్మానించినట్లు చైర్మన్ తెలిపారు. నిరుపయోగంగా మూత్రశాలలను త్వరలోనె వినియోగంలోకి తెస్తామన్నారు. వైస్‌చైర్మన్ నయీమోద్దీన్, కమిషనర్ జైతురాంనాయక్, మేనేజర్ మధుసూదన్, కౌన్సిలర్లు రామచందర్, లలితభిక్షపతి, సునీతాబాల్‌రెడ్డి, ఇస్రత్‌సిద్దిఖీ, లక్ష్మీనగేష్, సరిత అంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

మునిపల్లి తహసీల్దార్‌గా ఆశాజ్యోతి

మునిపల్లి, జూలై 27: మునిపల్లి మండల తహసీల్దార్‌గా ఆశాజ్యోతి శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు తహసీల్దార్‌గా పని చేసిన తెన్‌మొలి సంగారెడ్డి డివిజన్ డీఏవోగా బదిలీపై వెళ్లారు. వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి తహసీల్దార్‌గా పని చేసిన ఆశా జ్యోతి బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆశా జ్యోతికి డిప్యూటీ తహసీల్దార్ కృపానందం, సిబ్బంది చంధు, రజని తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.

కల్హేర్ తహసీల్దార్‌గా శివశ్రీనివాస్

కల్హేర్, జూలై 27: కల్హేర్ మండల తహసీల్దార్‌గా శివ శ్రీనివాస్‌ను నియమిస్తూ కలెక్టర్ వల్లూరి క్రాంతి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వికారాబాద్ కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న శివ శ్రీనివాస్‌ను కల్హేర్ మండలానికి బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన వెంకటేశ్వర్లు డిప్యూటీ కలెక్టర్‌గా ఉండగా శిక్షణలో భాగంగా కల్హేర్‌కు మార్చిలో వచ్చారు. శిక్షణ పూర్తి కాగానే వెంకటేశ్వర్లును సీసీఎల్ఏకు బదిలీ చేశారు.

జహీరాబాద్ పట్టణ సీఐగా బాధ్యతలు స్వీకరించిన శివలింగం

జహీరాబాద్, జూలై 27: జహీరాబాద్ పట్టణ సీఐగా శివలింగం శనివారం పదవీ బాధ్యతలను చేపట్టారు. సంగారెడ్డి ఎస్పీలో సీఐగా పనిచేసిన శివలింగం జహీరాబాద్‌కు బదిలీపై వచ్చారు. బాధ్యతలను చేపట్టిన శివలింగంకు పట్టణ ఎస్ఐ కాశీనాథ్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

రూరల్ సీఐగా జక్కుల హన్మంతు

న్యాల్‌కల్, జూలై 27: జహీరాబాద్ రూరల్(హద్నూర్) సీఐగా జక్కుల హన్మంతు శనివారం పదవీబాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తామన్నారు.

సెయింట్ ఆంథోనీస్‌లో ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం

సంగారెడ్డి అర్బన్, జూలై 27 : సంగారెడ్డిలోని శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ఆరోగ్య సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ లలిత, డా.ఆల్విన్‌కొకిలు హాజరై పీసీవోఎస్, పీసీవోడీ, సర్వైకల్ క్యాన్సర్ తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కన్సల్టెంట్ మేనేజ్‌మెంట్ పరాజ్ జీషాన్, కళాశాల ప్రిన్సిపాల్ జవహర్, అకాడమిక్ కౌన్సిలర్ డా.కృష్ణకుమారి, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయడమే 'అగస్త్య' ధ్యేయం

పాపన్నపేట, జూలై 27: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడమే అగస్త్య అంతర్జాతీయ ఫౌండేషన్ ధ్యేయమని ఫౌండేషన్ సభ్యుడు శ్రీకాంత్ వెల్లడించారు. పాపన్నపేట ఉన్నత పాఠశాలలో శనివారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు కృత్యాధార పద్ధతుల్లో మెళకువలు నేర్పినట్టు ఆయన వెల్లడించారు.

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి

- పలు గ్రామాల్లో గ్రామసభలు
- పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించిన అధికారులు



అల్లాదుర్గం: ముస్లాపూర్ గ్రామసభలో గ్రామస్థులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో ఎల్లయ్య

అల్లాదుర్గం, జూలై 27 : సీజనల్ వాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈవో) సీహెచ్ ఎల్లయ్య అధికారులను ఆదేశించారు శనివారం అల్లాదుర్గం మండలం ముస్లాపూర్‌గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాలతో పారిశుధ్యం లోపించి దోమలు వ్యాపించి డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందన్నారు. కాబట్టి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణపై ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం జడ్పీహెచ్ఎస్‌ను సందర్శించిన సీఈవో పారిశుధ్య నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించార కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్‌యాదవ్, తహసీల్దార్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

- చేగుంట: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం అధికారులు గ్రామసభలు నిర్వహించారు. మండలంలోని జైత్రం తండాలో నిర్వహించిన గ్రామసభలో మండల ప్రత్యేక అధికారి బ్రహ్మజి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ ప్రత్యేక అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం తండాలో వన మహోత్సవంలో భాగంగా బ్రహ్మజి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీ వో చిన్నారెడ్డి, ఇతర అధికారులు, మహిళా సంఘాలసభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.
- పెద్దశంకరంపేట: పట్టణంలో పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని మండలప్రత్యేక అధికారి హరిక్రిష్ణ తెలిపారు. శనివారం పెద్దశంకరంపేటలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో మురికి కాలువలను శుభ్రం చేయించాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూడాలని అధికారులకు సూచించారు. జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గ్రేస్‌బాయ్, ఎంపీవో విఠల్‌రెడ్డి, ఈవో వెంకట్ రాములు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.
- రామాయంపేట: వర్షాకాల నేపథ్యంలో సీజనల్ వ్యాదులు ప్రబలకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో సాజిదొద్దిన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఝాన్సిలింగాపూర్ గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పద్మ, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.
- మాసాయిపేట: మండల కేంద్రంలో శనివారం మండల ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. తాగునీరు, పారిశుధ్యసమస్యలు, దోమల వ్యాప్తి.. ఇలా పలు అంశాలపై అధికారులతో ప్రత్యేక అధికారి క్షుణ్ణంగా చర్చించారు. వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పారిశుధ్య, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఇంటింటికి తిరిగి జ్వర సర్వే నిర్వహించాలని ఆమె అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

రావి ఆకుపై మహంకాళి అమ్మవారి చిత్రపటం





రాష్ట్రంలో ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని ఓ ఉపాధ్యాయుడు రావి ఆకుపై అమ్మవారి చిత్రపటాన్ని గీసి ప్రతిభను చాటారు. మనోహరాబాద్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు బ్రహ్మచారి బోధనలోనే కాకుండా రాగి ఆకుపై అమ్మవారి చిత్రపటాన్ని రూపొందించి చిత్రకళలోనూ తన ప్రావీణ్యాన్ని ప్రదర్శించడంతో పలువురు ఆయనను అభినందించారు.

- మనోహరాబాద్. జూలై 27

నూతన చట్టాలపై అవగాహన ఉండాలి

- నర్సాపూర్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కె.అనిత

నర్సాపూర్, జూలై 27: కొత్తగా దేశంలో వచ్చిన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని నర్సాపూర్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కె.అనిత పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్ కోర్టు ఆవరణలో నిర్వహించిన న్యాయ విజ్ఞానసదస్సులో ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు స్థిర ఆస్తులు కొనుగోలు చేసే సమయంలో చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. తెల్ల కాగితాలపై, బాండ్ పేపర్లపై విక్రయాలు చెల్లవన్నారు. అదేవిధంగా ఇటీవల పార్లమెంటు ద్వారా భారత రాజ్యాంగబద్ధంగా నూతన చట్టాలు అమలు జరుగుతున్నందున ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కల్గి ఉండాలన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వ్యక్తులకు చట్టపరమైన సమస్యలు వచ్చినప్పుడు మండల లీగల్ సర్వీసెస్ కమిటీని సంప్రదిస్తే ఉచితంగా సేవలు అందించే వీలు ఉంటుందని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జడ్జి కె.అనిత పేర్కొన్నారు. కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ న్యాయవాది స్వరూపరాణి, న్యాయవాది ఆనంద్, సూపరిండెంట్ పద్మావతి ఉన్నారు

ముస్లింల సమస్యలు పరిష్కరించాలి

- 'ఖేడ్' ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డికి వినతి

నారాయణఖేడ్, జూలై 27: ఖేడ్‌పట్టణంలో ముస్లింలకు సంబంధించిన వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం స్థానిక ముస్లిం యాక్షన్ కమిటీ బాధ్యులు ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. పట్టణంలోని శ్మశాన వాటికకు స్థలం సరిపోనందున వక్ఫ్‌బోర్డు స్థలంలో 3 ఎకరాలను, ఈద్గా కోసం 5 ఎకరాలను ఇప్పించాలని, బీఆర్ఎస్ నాయకుల కబ్జాలో ఉన్న షాదిఖానాను కబ్జా నుంచి విడిపించాలని, ఉర్దూ మాధ్యమ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి కృషి చేయాలని, ముస్లిం సామాజిక భవనానికి స్థలం కేటాయించడతో పాటు భవనాన్ని నిర్మింప చేయాలని, స్వయం ఉపాధికి రాయితీ రుణాలు ఇప్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో తాహేర్‌అలీ, మోయినోద్దిన్ ఖురేషి, యూనుస్, దిల్‌దార్‌ఖాన్, యూసుఫ్, ఖయ్యూం, సుబూర్, దిల్‌దార్‌ఖాన్, ఫయాజ్, గౌసచిస్తీ ఉన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో 'ప్లాంట్ ఫర్ మదర్'



విద్యాలయం ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

ఝరాసంగం, జూలై 27: మండల పరిధిలోని మాచునూర్ గ్రామ శివారులో నూతనంగా నిర్మిస్తున్న కేంద్రీయ విద్యాలయ ఆవరణలో భారత ప్రధానమంత్రి పిలుపు మేరకు శనివారం ఎక్ క్లబ్ ఫర్ మిషన్ లైఫ్‌లో భాగంగా ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్రీయ విద్యాలయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ మనీష్‌కుమార్ మండోటియా, సిబ్బంది ఆనంద్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

- బీజేపీ మండలస్థాయి సమావేశాల్లో పిలుపు



హవేళిఘణపూర్: సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ అసెంబ్లీ ఇన్‌చార్జి పంజ విజయ్‌కుమార్

కోహీర్, జులై 27: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జహీరాబాద్ నియోజకవర్గంలో బీజేపీ సత్తా చాటాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జి గొల్ల భాస్కర్ పేర్కొన్నారు. శనివారం మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడు వైద్యనాథ్ అధ్యక్షతన నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో భాస్కర్ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్త బూత్‌స్థాయి నుంచే పార్టీని బలోపేతం చేసి త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు బీజేపీకి చెందిన అభ్యర్థులే విజయం సాధించేలా సమన్వయంతో కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వైద్యనాథ్, నాయకులు గొల్ల భాస్కర్, నౌబాద్ జగన్, సుభాష్ రెడ్డి, శంకర్‌రెడ్డి, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

- కల్హేర్: క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని సిర్గాపూర్ మండల బీజేపీ ఇన్‌చార్జి మాజీ జడ్పీటీసీ రాజురాథోడ్ కోరారు. సిర్గాపూర్ మండల పరిధిలోని వాసర్ గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి అధ్యక్షతన మండలస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో నారాయణఖేడ్ నియోజకవర్గ కో కన్వీనర్ నగేష్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు అరుణ్‌రాజ్ శేరికార్ తదితరులు పాల్గొన్నారు.
- నారాయణఖేడ్: కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లి బీజేపీని బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆపార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పత్రి రామక్రిష్ణ పేర్కొన్నారు. మండల కేంద్రమైన నిజాంపేటలో శనివారం ఆ మండల పార్టీ కార్యవర్గ సమావేశం జరిగింది. స్థానిక ఎన్నికల కోసం పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీని బలోపేతం చేయాలని రామక్రిష్ణ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పొట్టి కృష్ణ, సీనియర్ నాయకులు కాశీనాథ్, అంజయ్య, రాజు, రవీందర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.
- హవేళిఘణపూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని మెదక్ అసెంబ్లీ ఇన్‌చార్జి పంజ విజయ్‌కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని సర్దన గ్రామంలో మండలాధ్యక్షుడు రంజిత్‌రెడ్డి అధ్యక్షతన మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాబోయే లోకల్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైనికుడిలా పని చేయాలన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు నర్సింగ రావు, అసెంబ్లీ కన్వీనర్ మధుసూదన్, నాయకులు శ్రీనివాస్, రూపేందర్, శ్రీకాంత్, కార్యకర్తలు పాల్గొన్నారు.
- మనోహరాబాద్: పార్టీలోని ప్రతీ కార్యకర్త రానున్న స్థానిక ఎన్నికలపై దృష్టి సారించి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ రామ్మోహన్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని శుభం గార్డెన్‌లో ఏర్పాటు చేసిన బీజేపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశానికి రామ్మోహన్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీలోని ప్రతి ఒక్కరూ స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడు యాదగిరి, మొలుగు, మనోహరాబాద్ మండల అధ్యక్షులు నరేందర్‌చారి, రమేష్ యాదవ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి అజయ్, ఐలయ్య, నరేష్‌గౌడ్, సత్యనారాయణ, శ్రీశైలం, చిన్న మల్లేష్, లక్ష్మణ్‌సింగ్ ఠాగూర్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో బోనాల సందడి



సంగారెడ్డి అర్బన్: బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న తారా కళాశాల విద్యార్థినులు



జహీరాబాద్: అల్లీపూర్‌లో క్రిష్ణవేణి స్కూల్‌లో బోనాల వేడుకలు



సదాశివపేట: దుర్గామాత వేషధారణలో చిన్నారి



తూప్రాన్: పల్లవి మోడల్ స్కూల్‌లో బోనాల వేడుకలు

సంగారెడ్డి అర్బన్, జూలై 27 : సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం బోనాల పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో డప్పు చప్పుళ్ల మధ్య మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ, వెంకటేశం, ఫిజికల్ డైరెక్టర్ అశ్విని, తెలుగు అధ్యాపకులు డా.మహంతయ్య, జగదీశ్వర్, పద్మజ, విద్యారినులు పాల్గొన్నారు.

- జహీరాబాద్: పట్టణంలోని అల్లీపూర్‌లో గల శ్రీక్రిష్ణవేణి ఉన్నత పాఠశాలలో ఆషాడం బోనాల వేడుకలను ఘనంగ నిర్వహించారు. ఇందులో భాగంగా డప్పు చప్పుళ్ల మధ్య పోతరాజుల వేషధారణలో విద్యార్థుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో క్రిష్ణవేణి పాఠశాలల అధినేత వెదిరే ఆశోక్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.
- తూప్రాన్: పట్టణంలోని పల్లవి మోడల్ స్కూల్‌లో బోనాల పండుగ ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ పీవీ రమణ ఆధ్వర్యంలో విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో విద్యార్థుల పోతరాజు విన్యాసాలు, శివసత్తులు శిగాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- సదాశివపేట: సదాశివపేట పట్టణంలోని రావు పాఠశాలలలో నిర్వహించిన బోనాల ఉత్సవాల వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల విద్యార్థినులు, చిన్నారులు దుర్గామాత, ఇతర దేవతల వేషధారణతో బోనాల ఊరేగింపు నిర్వహించి, దుర్గామాత ఆలయంలో బోనాలను సమర్పించారు.
- మునిపల్లి: మండలంలోని బుదేరా ఎస్వీఆర్ స్కూల్‌లో విద్యార్థులు బోనాల ఉత్సవాలను పాఠశాల ప్రిన్సిపాల్ తాటిపల్లి మల్లేశం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థినులు నూతన వస్త్రాలు ధరించి బోనాలను ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారు.
- రామాయంపేట: రామాయంపేట మండల కేంద్రంలోని మంజీరా విద్యాలయంలో ఆషాడం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు సంప్రదాయ వస్త్రధారణలో అందంగా అలంకరించిన బోనాలు తలపై పెట్టుకుని ఊరేగింపు నిర్వహించారు. పోతరాజుల వేషధారణలో విద్యార్థుల విన్యాసాలు ఊరేగింపు సందర్భంగా చూపరులను ఆకట్టుకున్నాయి.